క్లుప్తంగా

తుది దశకు చేరిన భూ రీ-సర్వే



శావల్యాపురం: మండలంలో భూముల రీ-సర్వే తుది దశకు చేరిందని తహసీల్దారు షేక్ జాన్సైదులు ఆదివారం తెలిపారు. మండలంలోని శానంపూడి రెవెన్యూ గ్రామ పరిధిలో ఆదివారం సర్వే రాళ్లు పాతే కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. మండలంలోని కనమర్లపూడి రెవెన్యూ గ్రామంలో త్వరలో రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఐదు వేల రాళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, సర్వే చేసిన భూముల సరిహద్దుల్లో పాతే పనుల్ని ప్రారంభిస్తామని తెలిపారు. వేల్పూరు, పిచికలపాలెం గ్రామాల్లో రికార్డు పనులు పూర్తయ్యాని పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి బాలుడికి స్వల్ప గాయాలు



వినుకొండ టౌన్: ప్రమాదవశాత్తు కదులుతున్న రైలు నుంచి జారిపడి, స్వల్ప గాయాలతో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో బాలుడు చికిత్స పొందుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజమండ్రికి సూరిశెట్టి దయాకర్ (13) తండ్రి మరణించడంతో తల్లి ఇళ్లలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. గిద్దలూరులోని బంధువుల ఇంటికి దయాకర్ వచ్చి తిరిగి వెళుతున్న క్రమంలో, శనివారం ఉదయం వినుకొండ స్టేషన్‌లో రైలు నుంచి ప్లాట్‌ఫారం పైకి జారిపడటంతో గాయాలయ్యా యి. తోటి ప్రయాణికులు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. దయాకర్ ఇంటి పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్ ద్వారా బాలుడి సమాచారాన్ని తల్లికి చేరవేసినట్లు వైద్యశాల సిబ్బంది తెలియజేశారు. బాలుడికి జరిగిన ప్ర మాద సమాచారాన్ని తల్లికి చేరవేసేందుకు వలంటీర్ వ్యవస్థ చక్కగా ఉపయోగపడిందంటూ పలువు రు ప్రశంసించారు. ఇటువంటి వ్యవస్థను ఏర్పా టు చేసిన జగనన్నకు అభినందనలు తెలిపారు.

ప్రపంచ శాంతికి హేతువాద దృక్పథమే శరణ్యం



చిలకలూరిపేట టౌన్: ప్రపంచశాంతికి హేతువాద, మానవవాద దృక్పథమే శరణ్యమని భారత హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ చెప్పారు. పల్నాడు జిల్లా హేతువాద సంఘం ప్రథమ మహాసభ ఆదివారం పట్టణంలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచంలో అశాంతికి కులం, మతం, సామ్రాజ్యవాద దృక్పథాలు కారణమన్నారు. నిత్యజీవితంలో మూఢ విశ్వాసాలు-హేతువాదం అనే అంశంపై భారత హేతువాద సంఘం కోశాధికారి షేక్ బాబు, సహాయ కార్యదర్శి సింహాద్రి యల్లామందారెడ్డి ప్రసంగించారు. శాస్త్రీయ దృక్పథం -హేతుబద్ధ ఆలోచన అనే అంశంపై రేజేటి వెంకటేశ్వర్లు, విశ్వతత్వం-పరిణామం అనే అంశంపై మేడూరి సత్యనారాయణ మాట్లాడారు. అనంతరం మేడూరి సత్యనారాయణ రచించిన మానవుడు-మానవత్వం అనే పుస్తకాన్ని సంఘ సభ్యులు ఆవిష్కరించారు. అనంతరం పల్నాడు జిల్లా హేతువాద సంఘం అధ్యక్షుడిగా మేడూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కామేపల్లి రామారావు, ప్రధాన కార్యదర్శిగా చిన మస్తాన్‌ను ఎన్నుకున్నారు.

పోలేరమ్మ ఆలయంలో శ్రావణ మాస పూజలు

రొంపిచర్ల: మండల కేంద్రంలోని హైవే పక్కన గల శ్రీ పోలేరమ్మ ఆలయంలో ఆదివారం శ్రావణ మాస పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, మహిళలు, భక్తులు ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కొందరు మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్లు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వార్డు ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జోష్

- వినుకొండలో మొత్తం ఎనిమిది స్థానాలకు పోటీ
- ఎన్నికల్లో ఇద్దరు వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం
- నాలుగు చోట్ల ఏకగ్రీవం
- బొల్లాపల్లి మండలం లాలిపురం తండాలో చెల్లని నామినేషన్



చిన దానయ్య దొండపాడు



అనంతలక్ష్మి, హసనాయుని పాలెం



శిరీష పాతనాగిరెడ్డిపల్లి



నాను నాయక్ నెహ్రూనగర్ తండా



పెదసోమయ్య బొమ్మరాజుపల్లి

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గంలో జరిగిన వార్డు ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగరవేసింది. తొమ్మిది గ్రామ పంచాయతీ వార్డు అభ్యర్థులకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో ఈపూరు మండలంలో మూడు వార్డులకు ఎన్నికలు జరగగా, రెండు చోట్ల వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులు విజయం సాధించారు. మిగతా ఐదు స్థానాల్లో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒక చోట నామినేషన్ తిరస్కరణకు గురైంది.

వినుకొండ మండలం : మండలంలో రెండు వార్డులకు జరిగిన ఉప ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. దొండపాడు 5వ వార్డుకు జల్దీ చిన్న దానయ్య , హసన్నాయునిపాలెం 6వ వార్డుకు ఆచంట అనంతలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

నూజెండ్ల మండలం : పాత నాగిరెడ్డిపల్లిలో 8వ వార్డు నాదెండ్ల శిరీష ఏకగ్రీవంగా ఎన్నికైంది.

ఈపూరు మండలం : మండలంలో శనివారం జరిగిన మూడు వార్డుల ఉప ఎన్నికల్లో రెండు వార్డుల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు, ఒక వార్డులో టీడీపీ బలపరిచిన అభ్యర్థి గెలుపొందారు. ఎన్నికల అధికారులు తెలిపిన వివరాల మేరకు... బొమ్మరాజుపల్లి 1వ వార్డులో 146ఓట్లకు గానూ మొత్తం 135 పోలయ్యాయి. ఇందులో బోయనబోయిన పెదసోమయ్యకు 106, కాటం చినవెంకటేశ్వర్లుకు 29 ఓట్లు వచ్చాయి. ఇక్కడ వైఎస్సార్ సీపీ బలపరిచిన పెదసోమయ్య 77 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 7 వార్డులో 146 ఓట్లకు గానూ 130 పోలయ్యాయి. ఇందులో 87 ఓట్లు పోర్ల నరసింహారావుకు రాగా, 42 ఓట్లు బాణావత్ చెన్నానాయక్, ఒక ఓటు చెల్లనట్లు అధికారులు ప్రకటించారు. ఇక్కడ వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి పోర్ల నరసింహారావు 45 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉప్పరపాలెం 8 వార్డులో 124 ఓట్లకు గానూ 105 ఓట్లు పోలయ్యాయి. ఇందులో మేకల లక్ష్మయ్య 58, నరిబోయిన బాలకృష్ణకు 44 వచ్చాయి. మూడు ఓట్లు చెల్లలేదు. 14 ఓట్ల మెజార్టీతో తెలుగుదేశం పార్టీ బలపరిచిన మేకల లక్ష్మయ్య గెలుపొందారు.



నరసింహారావు బొమ్మరాజుపల్లి

బొల్లాపల్లి మండలం : నెహ్రూనగర్ తండా పంచాయతీలో 1 వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి మూఢావత్ నాను నాయక్ ఎన్నిక ఏకగ్రీవమైంది. లాలిపురం 2వ వార్డులో ఇస్లావత్ భవాని ఒకే నామినేషన్ వేసింది. దాన్ని అధికారులు తిరస్కరించారు. అక్కడ మరలా ఎన్నిక జరిగే అవకాశం ఉంది.

పట్టణంలో రూ.300కోట్లతో అభివృద్ధి, సంక్షేమం అమలు

11వార్డు గడప గడపలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



వార్డులో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: పట్టణంలో నాలుగేళ్ల వ్యవధిలో రూ.100కోట్లతో అభివృద్ధి పనులు, మరో రూ.200కోట్లతో సంక్షేమం అమలు చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని 11వ వార్డు ప్రకాష్ నగర్ రిక్షా సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి వార్డు మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్బారెడ్డి, సానికొమ్ము రమణారెడ్డి సారథ్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యల్ని అడిగి తెలుసుకొని, వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వార్డుకు రూ.20లక్షల చొప్పున ప్రభుత్వం అందజేసే నిధులతో అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో చేపట్టిన గడప కార్యక్రమంలో చివరి రోజు 11వ వార్డులో నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 70రోజులకు పైగా పట్టణంలో తిరుగుతూ ప్రతి గడపనూ పలకరించినట్లు పేర్కొన్నారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ రూ.1లక్ష నుంచి రూ.10లక్షల వరకు లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. గత నాలుగేళ్లలో 11వ వార్డులో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.7కోట్ల ప్రయోజనం చేకూరినట్లు వెల్లడించారు. పట్టణంలో 7,500మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని తెలిపారు. జగనన్న కాలనీలో మూడు వేల ఇళ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. పట్టణ శివారు కాలనీలన్నిటినీ పురపాలక పరిధిలోకి తీసుకొచ్చి తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు తదితర మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు. వార్డులో రూ.75లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేశామని, మరో రూ.20లక్షలతో మిగతా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని తిలక్ స్కూలును హైస్కూలు చేశామని చెప్పారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషా బేగం ఖాజావలి, మున్సిపల్ కమిషనరు జి. రామమోహన్, నాయకులు ముత్తనపల్లి ప్రసాద్, కె.పురుషోత్తమరావు, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, మద్దిరెడ్డి నరసింహారెడ్డి, రామిశెట్టి కొండ, కామిరెడ్డి నరిసిరెడ్డి, కూరపాటి శ్రీనివాసరెడ్డి, హాలీవుడ్ రఘు పాల్గొన్నారు.

ఉన్నవలో ఉత్సాహం ఉరిమింది

- మంత్రి విడదల రజినీకి గ్రామస్తులు ఘనస్వాగతం
- గడపగడపకూ చివరిరోజు కార్యక్రమంలో భారీ ర్యాలీ
- ఆద్యంతం అంబరాన్నంటిన సంబరాలు



మంత్రి రజినీని ర్యాలీతో స్వాగతిస్తున్న ఉన్నవ వాసులు



ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి రజిని

యడ్లపాడు: ఉన్నవ గ్రామంలో వైఎస్సార్ సీపీ ఉత్సాహం ఉరిమింది. పార్టీ నాయకులు ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీ పండుగ వాతావరణాన్ని తలపించింది. బోయపాలెం నుంచి ఉన్నవ వరకు ఉన్న దారులన్నీ వైఎస్సార్ సీపీ శ్రేణులతో నిండిపోయాయి. గడపగడపకూ కార్యక్రమం ఉన్నవలో చివరిరోజు పురస్కరించుకుని కృతజ్ఞతగా 300 వాహనాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్రచార వాహనంపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినీని ఊరేగిస్తూ పూల వర్షాన్ని కురిపించారు. మహిళలంతా ఆమెకు హారతులిస్తూ సాదర స్వాగతం పలికారు. పార్టీ గీతాలతో డీజే సౌండ్స్ నడుమ అడుగడుగున బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. పార్టీ పతాకాలతో ఆద్యంతం ఆనందంగా చిందులు వేస్తూ, కార్యకర్తలు చేసిన సందడి పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ర్యాలీలో ఉన్నవ గ్రామస్తులతో పాటు మండల, నియోజకవర్గం నుంచి పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

కార్యక్రమం కొనసాగిందిలా...

ఈనెల 16 నుంచి ప్రారంభమైన గడపగడపకూ కార్యక్రమం 17, 18, చివరి రోజైన 20వ తేదీ వరకు విస్తృతంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విడదల రజిని ముందుగా గ్రామంలోని ఎస్టీ కాలనీ నుంచి బస్టాండ్ సెంటర్, రాములవారి గుడి వీధి, లైబ్రరీ సెంటర్, నందులవారి వీధి, బ్రహ్మంగారి గుడి వీధి, సచివాలయం వీధి మీదుగా సొసైటీ వరకు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగేళ్లలో ప్రజలకు జరిగిన సంక్షేమ లబ్ధికి చెందిన కరపత్రాల్ని అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా ? అంటూ తెలుసుకుంటూ కొనసాగించారు. స్థానిక ప్రజల వ్యక్తిగత, సామాజిక పరమైన సమస్యలకు సంబంధించిన అర్జీలను తీసుకుంటూ, సంబంధిత అధికారులకు వాటిని సత్వరమే పరిష్కర దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అందరి సంక్షేమమే జగనన్న లక్ష్యం

అందరి సంక్షేమమే జగనన్న లక్ష్యమని మంత్రి రజిని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థతో రాష్ట్రంలోని పల్లెలకు గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి కాంక్షిస్తూ కుల, మత, వర్గ, పార్టీ విభేదాలు లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని అందించి దేశంలోని అనేక రాష్ట్రాల ప్రముఖులతో ప్రశంసలు అందుకుంటున్న విషయం తెలిసిందేనన్నారు. గ్రామస్థాయి నుంచి కేబినెట్ వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారందరికీ వివిధ హోదాల్లో పదవులు ఇచ్చిన నాయకుడు జగనన్నకు అందరూ అండగా నిలవాలని ఆమె కోరారు. సీఎం జగనన్నకు కృతజ్ఞతగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోమారు అధికారంలో తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఘంటా శంకర్, కల్లూరి విజయ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యులు ముక్తా వాసు, కోడే సుధారాణి, గుత్తా వేమలయ్య, జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు, సొసైటీ చైర్మన్లు ఓరుగంటి పూర్ణయ్య, బసెల శివరామకృష్ణ, వెంకటరెడ్డి, సర్పంచులు దంటూ సరళ, వడ్డేపల్లి నరసింహారావు, ఉప సర్పంచ్ చాగంటి శ్రీధర్, ఎంపీటీసీ సభ్యురాలు గుత్తి రమాదేవి, యడ్లపల్లి సత్యవతి, సామినేని రాఘవ, వలేటి ఉదయ్‌కిరణ్, నిమ్మగడ్డ జగన్‌మోహన్‌రావు, దంటూ ఏసోబు, యడ్లపల్లి శ్రీరామమూర్తి, బొల్లినేని పూర్ణయ్య, గల్లా ప్రభాకర్, పావులూరి వాసు, ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, కొప్పుల శ్యామ్యేల్‌పాల్, ముజాఫా, షంషుజుహా, షేక్ ఖాదర్‌బాష, పందుల బుల్లెబ్బాయి, గద్దె కోటయ్య, ఘంటా కిశోర్, కాకుమాను విజయ్, దండా నాగేశ్వరరావు, షేక్ జాకీర్, సింగారెడ్డి కోటిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన రేణుక ఎల్లమ్మ కొలుపులు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడిలో రేణుక ఎల్లమ్మ తల్లి కొలుపులు ఆదివారం ముగిశాయి. ఉత్సవాలు ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు కనమర్లపూడి, బొగ్గరం గ్రామస్తులు సారథ్యంలో రజకుల ఆరాధ్య దైవమైన పొట్లూరి వారి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవర విగ్రహాలను చీరాలలో సముద్రం స్నానం చేయించారు. అనంతరం గుడిలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజల నిర్వహించారు. రెండో రోజు గ్రామంలో మాతుడుపు (మాతంగి)కార్యక్రమాల్లో భాగంగా మేళతాళాల నడుమ అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. చివరి రోజు ఆదివారం కుమార బంతి భారీ అన్నదానంతో వేడుకలు ముగిశాయి. ఉత్సవాల సందర్భంగా రేణుకమ ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

పాత కక్షల నేపథ్యంలో ఘర్షణ

ఇద్దరికి గాయాలు

నాదెండ్ల: చందవరంలో పాతకక్షల నేపథ్యంలో ఆదివారం ఉదయం రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన గొంటు శ్రీనివాసరెడ్డి, ఆయన మేనమామ చేరెడ్డి కృష్ణారెడ్డి, అదే గ్రామానికి చెందిన గొంటు జయభాస్కరరెడ్డికి ఆస్తి తగాదాలున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో చేరెడ్డి కృష్ణారెడ్డి బైక్‌పై వెళ్తుండగా, జయభాస్కరరెడ్డి ట్రాక్టర్‌తో ఢీకొన్నాడు. అంతటితో ఆగకుండా గొడ్డలితో దాడి చేయబోగా, కృష్ణారెడ్డి తప్పించుకున్నాడు. ఆయన సోదరుడైన గొంటు శ్రీనివాసరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వారించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్యా ఘర్షణ చోటు చేసుకోగా జయభాస్కర రెడ్డి ఆవేశంతో శ్రీనివాసరెడ్డిపై దాడి చేశాడు. దీంతో గాయాలపాలైన కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డిలను కుటుంబ సభ్యులు నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘర్షణపై ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శ్రమతోనే ఉన్నత శిఖరాల అధిరోహణ

ఎమ్మెల్యే బొల్లా



రామిరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే బొల్లా తదితరులు

వినుకొండ(నూజెండ్ల): శ్రమనే ఆయుధంగా చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని నిరూపించిన ఘనత రొడ్డా రామిరెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కొనియాడారు. వినుకొండ ఎల్ఐసీ బ్రాంచీలో గత 20 ఏళ్లుగా ఏజెంట్‌గా సేవలందిస్తూ ఇటీవల డెవలెప్‌మెంట్ ఆఫీసర్‌గా రామిరెడ్డి ఎంపికైన సందర్భంగా ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా పాల్గొని ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఇంకా మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ, డీవో ఆరె శివారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, 30వ వార్డు కౌన్సిలర్ షకీలా, పట్టణ అధ్యక్షుడు పి.ఎస్. ఖాన్, నూజెండ్ల మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, రొడ్డా పుల్లారెడ్డి, శివారెడ్డి, నక్కా బ్రహ్మారెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రూ.6కోట్లతో మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణం



బాలాలయ నిర్మాణ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణాన్ని రూ.6 కోట్లతో చేపడుతున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా నిర్మాణ పనులకు ఆదివారం ఆయన పూజలు నిర్వహించి ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మితమయ్యే ఆలయాన్ని పూర్తిగా రాతికట్టడంతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఆలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసినట్టు వెల్లడించారు. ఇప్పటి వరకు దాతల నుంచి రూ.26లక్షలు విరాళంగా వచ్చినట్టు వివరించారు. గతంలో పట్టణ ప్రముఖులతో సమావేశం నిర్వహించిన సమయంలో పలువురు దాతలు విరాళాలు ప్రకటించారని, వారిని కమిటీ సభ్యులు కలుస్తున్నారని తెలిపారు. ప్రకాశం జిల్లా కందుకూరులో నిర్మితమైన అంకమ్మ తల్లి దేవాలయాన్ని ఆలయ అధికారులు పరిశీలించి వచ్చారని, ఆ దేవాలయం కూడా పూర్తిగా రాతికట్టడంతో నిర్మిస్తున్నారని తెలిపారు. నరసరావుపేటకు చెందిన శ్రీనివాసరావు ఈ పనుల్ని పర్యవేక్షిస్తున్నారని, అమ్మవారి ఆలయ నిర్మాణ పనుల్ని కూడా ఆయనకే అప్పగించాలని నిర్ణయించామని తెలిపారు. బాలాలయ నిర్మాణం పూర్తయిన తరువాత అమ్మవారిని ఈ ప్రతిష్ఠించి ఆలయ పునర్నిర్మాణం ప్రారంభిస్తారని తెలిపారు. శ్రావణ మాసంలో ఆలయ పనులకు శంకుస్థాపన చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ సభ్యులు జల్లి శ్రీనివాసరావు, వంకా శ్రీనివాసరెడ్డి. మాలపాటి తిరుపతిరెడ్డి, ఏలూరి అశోక్‌కుమార్, ఆలయ నిర్మాణ దాతలు నవనీతమ్మ, గుంజి చుక్కమ్మ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళి



నరసరావుపేటఃః స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు జి.అలెగ్జాండర్ సుధాకర్ సారథ్యంలో నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవల్ని కొనియాడారు. ప్రధాని మోదీ పాలనలో దేశాభివృద్ధి వెనకబడిందని విమర్శించారు. కార్యక్రమంలో సీదా కృష్ణ, నిమ్మకాయల బాజీ పాల్గొన్నారు.

కార్పొరేట్లకు తొత్తుగా మారిన బీజేపీ ప్రభుత్వం



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఏపూరి గోపాలరావు

శావల్యాపురం: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పేదలపై అనేక భారాలు మోపి, కార్పొరేటు సంస్థలకు తొత్తుగా మారిందని పల్నాడు జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఏపూరి గోపాలరావు విమర్శించారు. శావల్యాపురంలో ఆదివారం నిర్వహించిన మండల స్థాయి రైతు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. అక్కడ జరుగుతున్న అరాచకాలు ప్రధాని నరేంద్ర మోదీ అసమర్థ పాలనకు నిదర్శనమని తెలిపారు. ప్రజల మధ్య మతాల పేరుతో చిచ్చుపెట్టి, తన వైఫల్యాల్ని ప్రశ్నించకుండా ఉండేలా బీజేపీ ప్రభుత్వం ఆడుతున్న నాటకాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో గద్దె దించడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు కె.వి.ఆర్. మోహన్‌చందు, గణపర్తి వెంకటేశ్వర్లు, దుగ్గెంపూడి చినవెంకయ్య, భువనగిరి వెంకటేశ్వర్లు, జెన్నమ్మ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

చిలకలూరిపేట టౌన్: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చల్లా రమేష్ తెలిపారు. గుంటూరు టౌన్-2 డివిజన్ పరిధిలోని మేడికొండూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు పట్టణంలోని సుబ్బయ్యతోటలో ఉన్న ఇండోర్ ఉప కేంద్రానికి హాజరుకావాలని ఆయన కోరారు. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు.

ఉచిత వైద్య శిబిరంలో 205 మందికి పరీక్షలు

యడ్లపాడు: మండలంలోని వంకాయలపాడులో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చిలకలూరిపేటకు చెందిన జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 205 మంది పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా, సయ్యద్ ఖాసిం, మస్తాన్‌వలి, జాలాది సుబ్బారావు, షేక్ అబ్దుల్లా బాష, పట్నం కరీముల్లా, జమ్మలమడక ఆదిబాబు, మోజేష్, జిలాని కరీం పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం ప్రత్యేక ప్రభలు



నాదెండ్ల నందికుంట విఘ్నేశ్వరస్వామి సన్నిధికి తరలిస్తున్న ప్రభ



యడ్లపాడులో అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి జలాభిషేకం



చిలకలూరిపేటలో ప్రభ వద్ద పూజలు

చిలకలూరిపేట టౌన్: వరుణుడి కరుణ కోసం కట్టిన ప్రభ వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం పూజలు చేశారు. పట్టణంలోని 19వ వార్డు సూదావారిపాలెం వాసులు ఏర్పాటు చేసిన ప్రభ వద్ద వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు విడదల గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పార్టీ శ్రేణులతో కలసి పూజలు నిర్వహించారు. ప్రభ వద్ద కొబ్బరికాయలు కొట్టి సమృద్ధిగా వర్షాలు కురవాలంటూ కోరుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ తలహాఖాన్, పార్టీ నాయకులు బైరాకృష్ణ, విడదల కమలేంద్ర, బండ్ల శ్రీను, కత్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం ప్రభ నాదెండ్లలోని నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయానికి తరలి వెళ్లింది.

నాదెండ్లలో..

వరుణ దేవుని కరుణ కోసం అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ మొదలై మూడు నెలలైనా సరైన వానలు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో వర్షాలు పడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ చిలకలూరిపేట సూదావారిపాలెం రైతులు ప్రత్యేక ప్రభ కట్టారు. దాన్ని చిలకలూరిపేట నుంచి నాదెండ్ల సమీపంలోని నందికుంట విఘ్నేశ్వరస్వామి దేవస్థానానికి ఎడ్ల బండిపై తరలించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రభతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండి, మంచి ధరలు రావాలని మొక్కుకున్నారు.

అద్దంకి నాంచారమ్మకు జలాభిషేకం

యడ్లపాడు: ఖరీఫ్ సాగు ముమ్మరం కానున్న తరుణంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నుంచి కాపాడాలంటూ అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి అన్నదాతలు ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. యడ్లపాడులో కొలువైన గ్రామ దేవత గుడి వద్దకు రైతు కుటుంబాలు కడవలతో నీళ్లను మోసుకువచ్చారు. గుడినిండా నీటితో నింపి అమ్మవారికి జలాభిషేకం గావించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు, గ్రామం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు.